డంప్ యార్డు చెత్త తగ్గింపునకు కృషి చేయాలి

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కార్పొరేషన్, మే 9 : నగరం నుంచి ప్రతి రోజూ తడి, పొడి చెత్తను వేరు చేసి డంపు యార్డుకు వెళ్లే చెత్తను తగ్గించేలా అధికారులు కృషి చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం నగరంలోని మల్కాపూర్, లక్ష్మీపూర్, కొత్తపల్లి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇంట్లో ప్రతి రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను ఇంట్లోనే వేరు చేసి బుట్టల ద్వారా నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలని కోరారు. పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు ఇతర వస్తువులను సేకరించి స్వచ్ఛ ఆటోల ద్వారా కొత్తపల్లి, మల్కాపూర్ డంపు యార్డు వద్ద డీఆర్‌సీసీకి తరలించాలని, అలాగే తడి చెత్తను స్థానికంగా ఉన్న వర్మి కంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని కోరారు. సెగ్రిగేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి డంపు యార్డుకు వెళ్లే చెత్తను పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. నగర వ్యాప్తంగా ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుంచి కార్మికులు చెత్తను తప్పనిసరిగా సేకరించి 100 శాతం సెగ్రిగేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీపీ ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపాలి

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఆధునీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఆధునీకరణ, ఆన్‌లైన్ నల్లా ట్యాక్స్, వీధి దీపాల రిపేరింగ్, వెహికిల్ పర్చేస్, సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నగరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన డిజిటల్ లైబ్రరీ, కశ్మీర్ గడ్డ రైతు బజార్, బాలసదన్ భవన్, ఐసీసీసీ తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీలో ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఫీల్డ్ లెవల్‌లో తనిఖీ చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. సమావేశంలో ఈఈలు యాదగిరి, సంజీవ్, డీఈలు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాశ్, శ్రీనివాస్ రావు, ఏఈలు సతీశ్ కుమార్, గట్టు స్వామీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి

గురుకుల పాఠశాల విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఎల్‌సీ డాక్టర్ కనపర్తి సురేశ్‌కుమార్ తదితరులు

కరీంనగర్ రూరల్, మే 9: ప్రభుత్వం మైనారిటీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని మైనారిటీ గురుకుల ఆర్‌ఎల్‌సీ డాక్టర్ కనపర్తి సురేశ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం అస్లాం మసీద్ దగ్గర మైనారిటీ గురుకుల పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయ బృందంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అల్ప సంఖ్యాకులు అందరితో సమానంగా ఎదగడానికి గురుకులాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నదని చెప్పారు. ఈ సంవత్సరం పదో తరగతిలో గురుకుల పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని తెలిపారు. కరీంనగర్ బాయ్స్-2, ఇరుకుల్ల పాఠశాలలో 5,6,7,8,9వ తరగతుల్లో, ఇంటర్మీడియట్ ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశానికి ముస్లిం మైనారిటీ విద్యార్థులకు అవకాశం ఉందని పేర్కొన్నారు. గురుకుల్లాలో చేరిన విద్యార్థులకు అందించే వస్తువులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కో ఆర్డినేటర్ మహేందర్, కాలేజీ కో ఆర్డినేటర్ రాజు, నగేశ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర

చిగురుమామిడి ర్యాలీలో పాల్గొన్న మహిళలు, నాయకులు

చిగురుమామిడి, మే 9: మండల కేంద్రంలో జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రలో భాగంగా మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశం వేదికకు చేరుకున్నారు. అనంతరం హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి.. గ్రామాల్లో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందుల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మండలంలో డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో మహిళలు ముందుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడమ్ లింగమూర్తి, మాజీ ఎంపీపీ కొత్త వినీత, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, ఏపీఎం మట్టెల సంపత్, నియోజకవర్గ కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్, లోడీ సంస్థ ప్రతినిధులు ఉప్పుల కుమారస్వామి, గాండ్ల పద్మ, జేఏసీ బాధ్యులు వేముల జగదీశ్, తాళ్లపల్లి జగన్, తాళ్లపల్లి ప్రభాకర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, వంగర మల్లేశం, ఎస్ఐ జగదీశ్వర్, సీసీలు గంప సంపత్, వెంకటేశ్వర్లు, సత్యానారాయణ, వెంకటమల్లు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గందె రజిత, వీవోఏలు, సీఏలు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన



నగరంలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కార్పొరేషన్/శంకరపట్నం, మే 9: ఏపీలో 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తూ.. కరీంనగర్‌లో శుక్రవారం సాయంత్రం జర్నలిస్టులు నిరసన తెలిపారు. నగరంలోని తెలంగాణ చౌక్‌లో టీయూడబ్ల్యూజే ఐజేయూ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫొటో, వీడియో జర్నలిస్టులు పాల్గొని జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కక్షపూరితంగా పాత్రికేయులను వేధించడం సమంజసం కాదన్నారు. అలాగే, శంకరపట్నం జర్నలిస్టు యూనియన్ నాయకులు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం

కొత్తపల్లి, మే 9 : మండలంలోని ఎలగందుల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం.. పాఠశాలలో అందిస్తున్న డిజిటల్ విద్యాబోధన, కంప్యూటర్ శిక్షణ, క్రీడా పోటీల నిర్వహణ, సైన్స్ ప్రయోగశాల, గ్రంథాలయం తదితర సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని కోరారు.

భరోసా.. నిరాశ!

- కొత్త జాబ్ కార్డులు ఇచ్చేదెన్నడో?
- ఆత్మీయ భరోసా అందేదెన్నడో..
- ఎలాంటి ప్రకటన చేయని ప్రభుత్వం
- దరఖాస్తుదారుల్లో సన్నగిల్లుతున్న ఆశలు

ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు (ఫైల్)

కలెక్టరేట్, మే 9 : 'ఉపాధి కూలీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న మాదిరిగానే, ఉపాధి కూలీలకు కూడా నెలనెలా ఆర్థిక సాయం అందించి, ఆత్మీయ భరోసా కల్పిస్తాం. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ, కొద్ది మాసాల క్రితం అధికార నేతలు ఆర్భాటంగా ప్రకటన చేశారు. దీంతో, అందరితో పాటు తమకూ సాయమందుతుందని ఉపాధి కూలీలు సంబురపడ్డారు. అయితే భరోసా పొందేందుకు అవసరమైన జాబ్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో తమ ఆశలు సన్నగిల్లుతున్నాయని అనేక మంది కూలీలు వాపోతున్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ, భూమి లేని కూలీలకు కూడా ఆర్థిక సాయమందించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేస్తున్నది. ఉపాధి పనులకు హాజరయ్యే రోజులను బట్టి, ఈ పథకానికి ఎంపిక చేస్తుండగా, భూమి లేని నిరుపేదలంతా, ఉపాధి పనులు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జాబ్‌కార్డులు పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. 2022-23 సంవత్సరంలో ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని పేదలకు భరోసా వర్తింపజేస్తున్నారు. ఆ ఏడాదిలో జాబ్‌కార్డుల్లేని వారిలో కొద్దిమందికి కొత్తగా పంపిణీ కూడా చేశారు. దీంతో, తమకు కూడా కార్డులొస్తాయనే ఆశతో దరఖాస్తు చేసుకున్న వారికి నిరాశే ఎదురైంది. జాబ్‌కార్డుల దరఖాస్తు సైట్ మూసివేయగా, ఇప్పటివరకు తిరిగి తెరుచుకోలేదు. ఆత్మీయ భరోసా అందాలంటే ఉపాధి పనులు చేయాల్సిందే. ఉపాధి పనులకు వెళ్లాలంటే జాబ్‌కార్డు విధిగా ఉండాల్సిందే. ఈ పథకంపై ప్రకటన వెలువరించిన అనంతర కాలం నుంచి ఆన్‌లైన్‌లో కొత్తజాబ్‌కార్డుల దరఖాస్తుల ఆప్షన్ రాక, జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకు వెళ్లలేకపోతున్నారు. కొత్త జాబ్‌కార్డుల మంజూరు ప్రస్తుతానికి లేకపోగా, తిరిగి ఎప్పుడు అవకాశం కల్పిస్తారో తెలియక కూలీలంతా ఆందోళన చెందుతున్నారు. పనులు కరువై కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండగా, మరికొందరు ఇళ్లవద్దనే ఉంటూ ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి కొత్తగా జాబ్‌కార్డులు మంజూరు చేసి, తాము ఆత్మీయ భరోసాకు అర్హత పొందే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

సైట్ తెరవగానే జాబ్‌కార్డుల మంజూరు

ప్రస్తుతం కొత్త జాబ్‌కార్డుల మంజూరుకు అవకాశం లేదు. దీనికి సంబంధించిన ఆప్షన్ ప్రస్తుతం నిలిపివేశారు. తిరిగి జాబ్‌కార్డుల సైట్ తెరవగానే, దరఖాస్తు చేసుకున్న కూలీలకు కార్డులు అందజేస్తాం.

- శ్రీధర్, డీఆర్‌డీవో, కరీంనగర్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అల్ఫోర్స్ విద్యార్థినుల ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న రవీందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మే 9 : జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థినులు మెడికో హెల్త్ కేర్ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ వీ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యార్థినుల అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు నాగలక్ష్మి, వైశిత, గౌతమి, సాయి కీర్తన, హరిణి, సింధుజ, శ్రీ లాస్య, అస్రామహవీష్, షేక్ షిరీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. కళాశాలలో విద్యతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్, వివిధ అంశాల్లో శిక్షణతోనే ఇది సాధ్యమైందన్నారు. ఇక్కడ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, టీపీవో, అధ్యాపకులు ఉన్నారు.

రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

గంగాధర, మే 9: ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా రోడ్డును ఆక్రమిస్తే చర్యలు తప్పవని శిక్షణ ఎస్ఐ స్వాతి హెచ్చరించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారు, వాహనాలు పార్కింగ్ చేస్తున్న వారితో శుక్రవారం ఎస్ఐ మాట్లాడారు. రోడ్డు ఆక్రమణ వల్ల కలుగుతున్న ఇబ్బందులను వివరించారు. రోడ్డు పక్కన ముగ్గుపోయించి హద్దు ఏర్పాటు చేశారు. బార్డర్ దాటి రోడ్డుపై వ్యాపారాలు చేసినా, వాహనాలు నిలిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి రాజసులోచన, పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

17లోగా సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టరేట్, మే 9: ఈనెల 17లోగా సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని, సర్వే ట్రైనింగ్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ సుమన్ తెలిపారు. ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా కనీసం 60శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ, డిప్లొమా, బీటెక్‌లో సివిల్ చదివిన వారు మీసేవ కేంద్రాల్లో రూ.100 చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. శిక్షణ ఫీజు కింద ఓసీ అభ్యర్థులు రూ. 10వేలు, బీసీలు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందని, 50 పనిదినాల్లో జిల్లా కేంద్రాల్లో అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

సైదాపూర్, మే 9: మండలంలోని వెన్కేపల్లి, రాంచంద్రాపూర్‌లో భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు

కోరుట్ల, మే 9: వయోవృద్ధులైన కన్న తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ విస్మరిస్తే శిక్షార్హులవుతారని, జైలుశిక్ష, జరిమానా వంటి చట్టపరమైన చర్యలు తప్పవని కోరుట్ల ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ జివాకర్‌రెడ్డి హెచ్చరించారు. కోరుట్ల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సీనియర్ సిటీజన్ ఫోరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అవగాహనకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలు, స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో రాజమణి, సీనియర్ సిటీజన్స్ ఫోరం జిల్లా కమిటీ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి రాజ్ మోహన్, కోశాధికారి లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాలి

కలెక్టరేట్, మే 9: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు అంగన్‌వాడీ సిబ్బంది, టీచర్లు, ఆయాలు కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మరో నెల రోజుల్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటినుంచే చిన్నారులను సమాయత్తం చేసే క్రమంలో, అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీల్లో ప్రవేశాలు పెంచడంపై సంబంధితాధికారులతో శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ బాట నిర్వహించి ఆరేళ్లలోపు పిల్లలందరినీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ సేవలు, నూతన సిలబస్ ద్వారా అందజేస్తున్న ప్రత్యేక బోధనపై తల్లిదండ్రులకు తెలియజేస్తూ, నమోదు పెంచాలన్నారు. ప్రీస్కూల్ పూర్తి చేసిన పిల్లల జాబితా మండల విద్యాధికారులకు అందజేయాలని సూచించారు. జాబితాల్లోని పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రైవేటు భవనాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలన్నీ ప్రభుత్వ పాఠశాలలకు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని ఆదేశించారు. ఇప్పటికే మార్చాల్సిన సెంటర్లను గుర్తించామని, ప్రభుత్వ భవనాల్లో వీటికి కావాల్సిన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

భారత ఆర్మీకి సంఘీభావంగా న్యాయవాదుల ర్యాలీ

హుజూరాబాద్ టౌన్, మే 9: పాకిస్థాన్‌పై పోరాడుతున్న భారత ఆర్మీకి సంఘీభావంగా హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యతిపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, పాకిస్థాన్ ఇకనైనా ఉగ్రవాద చర్యలను విరమించుకోవాలని, లేని పక్షంలో భారత ఆర్మీ తగిన రీతిలో జవాబు చెబుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల రమేశ్, ముఖ్య సలహాదారు అందే వెంకటేశ్వరరావు, లైబ్రరీ సెక్రటరీ భాను కిరణ్, ట్రెజరర్ కుమారస్వామి, న్యాయవాదులు నల్ల భూమి రెడ్డి, కంకణాల అమరేందర్ రెడ్డి, యేంగల లింగమూర్తి, కలకోటి శ్రవణ్, తాల్లపెల్లి కుమార్, జక్కుల శ్రీనివాస్, మోరే కళ్యాణ్, చిదురాల శ్రీనివాస్, బొంగొని హరికృష్ణ, గుర్రాల వెంకట కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కమాన్‌చౌరస్తా, మే 9 : జిల్లా కేంద్రంలో 13న పాలిసెట్ (పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 పరీక్ష కొనసాగనుండగా, ఇందుకోసం జిల్లా కేంద్రంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 4234 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకే చేరుకోవాలని, 10 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోని అనుమతిస్తారని తెలిపారు. 11 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమంతించరని స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్ టికెట్లు https://polycet.sbtet.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

బాల్య స్నేహితుల ఔదార్యం

చింతల కిరణ్ భార్య శ్వేతకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

హుజూరాబాద్ టౌన్, మే 9: హుజూరాబాద్ పట్టణానికి చెందిన చింతల కిరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన భార్య శ్వేత చిన్ననాటి స్నేహితులు ఔదార్యం చాటుకున్నారు. కమలాపూర్ హైస్కూల్‌కు చెందిన 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు.. శ్వేత, ఆమె ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడి పరిస్థితి చూసి చలించిపోయారు. స్నేహితురాలి కుటుంబానికి 36వేల రూపాయలు సాయం అందించి మేమున్నామని భరోసా ఇచ్చారు. ఇక్కడ గడల సతీశ్, ప్రవీణ్, వెంకటేశ్, సుమన్, సురేశ్, అనిత, సరిత ఉన్నారు.

జిల్లా అదనపు కోర్టు ఏర్పాటు చేయించండి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అరుణ్ కుమార్

హుజూరాబాద్ టౌన్, మే 9: హుజూరాబాద్ కోర్టులో జిల్లా అదనపు కోర్టు ఏర్పాటు చేయించాలని హుజూరాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, జనరల్ సెక్రటరీ ఎర్రోళ్ల రమేశ్, న్యాయవాది మోరె కళ్యాణ్ శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ వినతిపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి, ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.

వధూవరులను ఆశీర్వదించిన కౌశిక్‌రెడ్డి

వీణవంక, మే 9: రెడ్డిపల్లిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పైడిమల్ల శ్రీనివాస్-శ్రీదేవి దంపతుల కుమారుడు సాహిత్‌గౌడ్ వివాహం అంజలితో జరుగగా శుక్రవారం వారి ఇంటి వద్ద జరిగిన రిసెప్షన్‌కు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచులు పోతుల నర్సయ్య, అడిగొప్పుల సత్యనారాయణ, నాయకులు రాజయ్య, అంబాల మధునయ్య, చింతల సుమన్, పోతుల సురేశ్, భూమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

శంకరపట్నం, మే 9: మొలంగూర్ శివారులోని సర్వే నంబర్ 703లోని ప్రభుత్వ భూములను ఆక్రమణదారుల చెరనుంచి విడిపించి కాపాడాలని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని టీజేఏస్, టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వారు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ పరంపోగు భూమిని ఆక్రమణదారుల నుంచి విడిపించి నిరుపేదల ఇండ్లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోరె గణేశ్, మోరె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

సమ్మె వాల్ పోస్టర్‌ను హమాలీ కార్మికులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్ తదితరులు

కరీంనగర్ రూరల్, మే 9: నరేంద్రమోదీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల రద్దు కోసం ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లోని బొమ్మకల్ బైపాస్‌లో గల సిమెంట్ గోదాం వద్ద ఏఐటీయూసీ ముద్రించిన సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను హమాలీ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిమెంట్ గోదాం హమాలీ సంఘం అధ్యక్షుడు జంగం తిరుపతి, ఉపాధ్యక్షుడు బాగోతం వీరయ్య, నాయకులు నన్నవేని శ్రీనివాస్, నన్నవేని కొమురయ్య, పల్లెర్ల రాములు గౌడ్, ముత్యాల శ్రీనివాస్, దానవేని కొమురయ్య, ఉప్పారం శ్రీనివాస్, జక్కుల ఐలయ్య, దొంగల శ్రీనివాస్, బోయిని ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 9: నగరంతో పాటు కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలో లైన్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యారణ్యపురి, సరస్వతి నగర్, మానికేశ్వరీ నగర్, ఉదయం 8.30నుంచి 10గంటల వరకు శక్తి టెంపుల్ ఏరియా, బాలాజీ సూపర్ మార్కెట్ ప్రాంతం, సంతోష్ నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, గీతాభవన్ వెనుక ప్రాంతం, కార్పెంటర్ సొసైటీ, సంతోషిమాత హనుమాన్ టెంపుల్ ఏరియా, న్యూ లేబర్ అడ్డా, సాయిబాబా గుడి, విద్యానగర్, విజయ దుర్గ కాలనీ, హిందుపురి కాలనీ, ఆర్టీసీ వర్క్ షాప్ ఏరియా, ఎస్సారార్ డిగ్రీ కాలేజీ, చైతన్య పురి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హుజూరాబాద్ టౌన్, మే 9: హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు హుజూరాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంతో పాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వీణవంక, మే 9: మండలంలోని పోతిరెడ్డిపల్లి, వీణవంక సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వీణవంక ఏఈ సురేశ్వరాచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్, కొండపాక గ్రామాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు, వీణవంక సబ్‌స్టేషన్ పరిధిలోని వీణవంక, రామకృష్ణాపూర్, నర్సింగాపూర్, లస్మక్కపల్లి, కనపర్తి, రెడ్డిపల్లి, శ్రీరాములపేట, అచ్చంపల్లి, కొత్తపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గోపురం నిర్మాణ పనులకు శంకుస్థాపన

మానకొండూర్, మే 9: మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గోపురం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు బసవయ్య, రాజేశ్, ధర్మకర్తలు శంకర్‌లింగం, గోపాల్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, బాకారాపు సమ్మయ్య, చలిగంటి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ సర్కిల్ సీఐగా సదన్‌కుమార్

తిమ్మాపూర్, మే 9: తిమ్మాపూర్ సర్కిల్ సీఐగా సదన్‌కుమార్ శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన తిమ్మాపూర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న కర్రె స్వామి ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్, గన్నేరువరం, చిగురుమామిడి మండలాల ఎస్ఐలతో సమావేశం నిర్వహించి, శాంతిభద్రతలపై చర్చించారు. ఆయనకు ఎల్ఎండీ ఎస్ఐ వివేక్, ట్రైనింగ్ ఎస్ఐ క్రాంతికుమార్, మండలంలోని పలువురు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దేశ భద్రతకు.. ఐక్యతే బలం

దేశ భద్రతకు ఐక్యతే మనకు ఇప్పుడు కావాలని, ప్రతి పౌరుడూ దేశం కోసం పాటుపడాలని సీఐ సదన్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయ ఆవరణలో వివిధ పార్టీలు, ముస్లింలతో పీస్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. దేశం కోసం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు. ఇక్కడ ఎల్ఎండీ ఎస్ఐ వివేక్, ట్రైనీ ఎస్ఐ క్రాంతి కుమార్, నాయకులు ఎస్ఎల్ గౌడ్, నర్సింగరావ్, కొత్త తిరుపతిరెడ్డి, ఎండీ ఫయాజ్, మిరాజ్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనం.. ఆహ్లాదం మాయం

ఉల్లంపల్లిలో ఎండిపోయిన పల్లె ప్రకృతి వనం, కింద పడిపోయిన ప్రకృతి వనం బోర్డు

చిగురుమామిడి, మే 9: హరితహారంలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు ప్రస్తుతం నిర్వహణ కొరవడి ఎండిపోతున్నాయి. నిధుల లేమితో పాటు అధికారుల పర్యవేక్షణ కరువు, సిబ్బంది అలసత్వంతో ఈ పరిస్థితి నెలకొన్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని 17 గ్రామాల్లో 2020లో 28 వేల మొక్కలతో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయగా, ఐదు సంవత్సరాలు అవి పచ్చదనంతో కళకళలాడాయి. ప్రస్తుతం అవి పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో ఉండగా, గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటి టాంకర్లను ఏర్పాటు చేసుకొని మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత వారిపై ఉంది. కానీ, చాలా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిధుల కొరత కారణంగా.. పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించడం లేదని తెలుస్తున్నది. దీనిపై ఎంపీవో రాజశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా, పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలకు ప్రతి శుక్రవారం జీపీ ట్రాక్టర్ల ద్వారా నీరందిస్తున్నామని తెలిపారు. ఇటీవల ఎండ తీవ్రతకు చాలా మొక్కలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని, వాటిని కాపాడేందుకు ఇకపై వారానికి రెండుసార్లు నీటిని అందించేలా చూస్తామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, JOGU DAVEEDU, S/o. Devadasu, R/o. H.No. 2-79, (V) Repaka, (M) Ellanthakunta, Dist: Rajanna Sircilla-505 528, Telangana. Changed My Name to JOGU DEVENDAR, S/o. Devadasu.
NT-343024

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189